## పరిధి మారినా..

# తీరని ట్రాఫిక్ సమస్య

- పరిపాలన సౌలభ్యంలో భాగంగా మారిన పోలీస్‌స్టేషన్ పరిధి
- విధుల్లో నూతన పోలీస్ అధికారులు, సిబ్బంది
- ఓయూ కాలనీలో గంటల తరబడి ట్రాఫిక్‌జామ్
- ఫుట్‌పాత్‌లు, రోడ్లపై వాహనాల పార్కింగ్
- ఫిర్యాదు చేసినా తీరని సమస్య





రోడ్డుపైన బైక్‌ల పార్కింగ్

**నార్సింగ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** పరిపాలన సౌలభ్యం కోసం ఆ ప్రాంతం పరిధిని ఒక పోలీస్‌స్టేషన్ నుంచి మరొక పోలీస్‌స్టేషన్‌కు మార్చారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అంతా కొత్త వాళ్లు వచ్చారు. అక్కడ ఏమైనా పరిస్థితులు మారుతాయేమో అనుకున్నారు ప్రజలు. కానీ, ఏమీ మార లేదు.

- షేక్‌పేట్ డివిజన్‌లోని ఓయూ కాలనీలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రధాన రోడ్డుకు రెండు పక్కలా ఫుట్‌పాత్‌లతో పాటు రోడ్డును ఆక్రమించి వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తుంటారు. దీనివల్ల ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం గంటల తరబడి ట్రాఫిక్‌జామ్ అవుతోంది. ఒక్కోసారి జామ్ రెండు, మూడు గంటలు కూడ జామ్ అవుతోంది. మణికొండ, పుప్పాల్‌గూడ, నార్సింగ్‌కు వెళ్లేవారు, షేక్‌పేట్, టోలిచౌకి, జూబ్లీహిల్స్ వెళ్లే వారు ఎక్కువ మంది ఓయూ కాలనీ రోడ్డును ఎంచే వెళ్తారు. దీంతో ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య భారీగానే ఉంటుంది. ఈ రోడ్లపై అక్రమ పార్కింగ్ తొలగించాలని, కొన్నాళ్లుగా ఇక్కడి ప్రజలు ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. అయినా, ఫలితం లేకుండా పోయింది.
- మొన్నటి వరకు ఓయూ కాలనీతో పాటు షేక్‌పేట్ ప్రాంతం టోలిచౌకి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఉండేది. ఇటీవల పోలీస్‌స్టేషన్ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ ప్రాంతాన్ని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఇక్కడ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఈ ప్రాంతంలోని ట్రాఫిక్ వ్యవస్థలో మార్పు రాలేదని, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు కూడా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపలేకపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అక్రమ పార్కింగ్..

రోడ్డుపై అక్రమ పార్కింగ్, వాహనాల తొలగింపులో భాగంగా ట్రాఫిక్ పోలీసులు ఓయూ కాలనీలోని ఓ భవనంలో ఉంటున్న నివాసిని రోడ్డుపై కార్లు తొలగించాలని సూచించారు. తన కారు ఒక్కటే రోడ్డుపై ఉందని, ట్రాఫిక్‌కు ఎలాంటి విఘాతం లేదని, దుకాణదారులు, హోటళ్ల యజమానులు రోడ్డును ఆక్రమించుకొని వ్యాపారం చేస్తూ అక్రమ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారని, ముందు వాటిని తొలగించండని ఆ నివాసి ట్రాఫిక్ పోలీసులకు బదులిచ్చారు. చివరకు కారును అక్కడి నుంచి పోలీసులు తీయించారు. ఈ విషయాన్ని పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నచ్చిన వారికి రోడ్లపై పార్కింగ్ అనుమతి ఇస్తున్నారని, వారికి నచ్చని వారి బండ్లు తీపిస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా హోటళ్లు, దుకాణాదారుల వాహనాలు రోడ్డుపై ఎలా పార్కింగ్‌కు అనుమతిస్తారని, హోటళ్లతో పోలీసులకు ఉన్న అంతర్గత ఒప్పందం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఓయూ కాలనీ ప్రధాన రోడ్డుపై అక్రమ పార్కింగ్ తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



ఓయూ కాలనీ రోడ్లపై అక్రమ పార్కింగ్

### డివైడర్లు ఏర్పాటు చేయండి

ఓయూ కాలనీ ప్రధాన రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేస్తే అక్రమ పార్కింగ్ సమస్య పూర్తిగా పరిష్కారం అవుతది. అంతేగాకుండా ట్రాఫిక్ జామ్ సమస్య ఉండదు. ఈ విషయంపై అధికారులు దృష్టి పెట్టాలి. డివైడర్ల కోసం ఇప్పటికే మున్సిపల్, ట్రాఫిక్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. - **పద్మనాభస్వామి, మణికొండ**

### ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించండి

ఓయూ కాలనీ ప్రధాన రోడ్డుపై ఫుట్‌పాత్ మొత్తం ఆక్రమించుకున్నారు. లేవుట్‌లో ఉన్న ప్రకారం రోడ్డు 60 అడుగులు లేదు. ముందుగా ఆ 60 అడుగుల రోడ్డును అధికారులు వెలికి తీసి కాపాడాలి. ఎక్కడుందో చూపించాలి. ఎవరు పడితే వారు ఆక్రమించుకుంటే అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారు.

**- సి.మోహన్, షేక్‌పేట్**



సుందరీకరణ పనులపై అధికారులతో చర్చిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

## 23లోగా సుందరీకరణ పనులను పూర్తి చేయాలి

**హైదరాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో చేపట్టిన సుందరీకరణ పనులను ఈనెల 23లోగా పూర్తి చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు హెడ్ ఆఫీస్ ప్రాంగణంలో చేపడుతున్న ఫౌంటైన్, ల్యాండ్ స్కేపింగ్, గాంధీజీ, అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటు, పెయింటింగ్ పనులు, నూతన బోర్డు తదితర పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈనెల 25న జీహెచ్‌ఎంసీ జనరల్ బాడీ మీటింగ్ రోజున సుందరీకరణ పనులను ప్రారంభించాల్సి ఉన్నందున పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆమె పేర్కొన్నారు.



వింటర్ ఉత్సవ్ మేళాలో సినీ హాస్యనటుడు అలీతో నిర్వాహకుడు మీర్జా రఫీక్‌బేగ్ తదితరులు

## ఆకట్టుకుంటోన్న వింటర్ ఉత్సవ్ మేళా

**ఖైరతాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటైన వింటర్ ఉత్సవ్ మేళా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సినీ హాస్యనటుడు అలీ ప్రారంభించిన ఈ మేళాలో చూడముచ్చటగా తయారైన సెరియల్ వాటర్ ఫాల్ చూపరులను విశేషంగా ఆకర్షిస్తోంది. వేల సంవత్సరాల క్రితం నాటి జంతువులతో పాటు అంటార్కిటికా అందాలను అద్భుతంగా తీర్చిదిద్దారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఎంజాయ్ చేసేలా గేమ్ జోన్, ఎమ్యూజ్‌మెంట్స్ జోన్, ఫుడ్ జోన్‌లు ఉన్నాయని, మేళా ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి 10.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకుడు మీర్జా రఫీక్ బేగ్ తెలిపారు.

## వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

**బేగంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** భర్త, అత్తింటి వేధింపులు భరించలేక వివాహిత ఉరేసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అంబర్‌పేటకు చెందిన కవిత(38)తో ఫతేనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భట్టి రాఘవేంద్ర(39)కు 2023లో వివాహమైంది. ఈ సమయంలో నగదుతో పాటు బంగారు ఆభరణాలు వరుడికి కట్నంగా ఇచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనంతరం మద్యానికి బానిసైన రాఘవేంద్ర తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పరిచేస్తూ కవిత కుటుంబాన్ని పోషిస్తుంది. పుట్టింటి వద్ద నుంచి డబ్బులు తెమ్మని కవితను రాఘవేంద్ర వత్తిడి చేశాడు. ఈ విషయాన్ని పుట్టింటి వారికి కవిత చెప్పడంతో ఆమె తండ్రి రూ.5 లక్షలు ఇచ్చాడు. అయినప్పటికీ నిత్యం మద్యం తాగొచ్చి వేధిస్తున్నాడు. అత్తింటి వారు కూడ వేధిస్తుండడంతో భరించలేని కవిత ఈనెల 15న ఉరేసుకుంది. గమనించిన రాఘవేంద్ర బాలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్స పొందుతూ ఆమె ఈనెల 20న మృతిచెందింది. ఇది తెలిసిన వెంటనే రాఘవేంద్ర పరారయ్యాడు. ఆస్పత్రికి వచ్చిన కవిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు రాఘవేంద్రను గురువారం రిమాండ్‌కు తరలించారు.

## ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

**అమీర్‌పేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** మార్గశిర అమావాస్యను పురస్కరించుకుని గురువారం బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఏఐసీసీ జాతీయ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు సత్యనారాయణ, సురేష్‌వర్మ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మిరియాల నవీన్, నాగరాజు, రంగాచారి స్వామి పాల్గొన్నారు.

## వైభవంగా శివపార్వతుల కల్యాణం

**పంజాగుట్ట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్ ప్రేమ్‌నగర్ లోని శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర ఆలయంలో బస్తీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



జెర్సీ ఆవిష్కరణలో శ్రీలీల తదితరులు

## హైదరాబాద్ రాయల్స్ జెర్సీ ఆవిష్కరణ

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ఇండియన్ పికిల్‌బాల్ లీగ్ (ఐపీబీఎల్)లో హైదరాబాద్ రాయల్స్ జట్టు బరిలోకి దిగుతోంది. గురువారం హైదరాబాద్ జట్టు జెర్సీను ఆ జట్టు యజమాని అనుభవ్, నటి శ్రీలీల ఆవిష్కరించారు. వచ్చే నెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు ఈ పోటీలు ఢిల్లీలో జరగనున్నాయి. హైదరాబాద్‌తో పాటు, ముంబై, చెన్నై, బెంగళూరు, గురుగ్రామ్ ఫ్రాంచైజీలు ఈ లీగ్‌లో బరిలోకి దిగుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పికిల్ బాల్ పోటీల్లో హైదరాబాద్ క్రీడాకారులకు ఒక వేదికను కల్పించేందుకు ఈ జట్టును కొనుగోలు చేశామని అనుభవ్ తెలిపారు.



మధురానగర్ డి-బ్లాక్ పార్కు ఎదురుగా రహదారిపై పడేసిన వ్యర్థాలు

## నాలా వ్యర్థాలు తొలగించేది ఎప్పుడు?

**వెంగళరావునగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీ మధ్య నుంచి మురుగునీటి నాలా ప్రవహిస్తోంది. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రకటించారు. సంబంధిత విభాగం సిబ్బంది రెండు రోజుల క్రితం డి-బ్లాక్ పార్కు ఎదురుగా నాలా నుంచి వ్యర్థాలు తీశారు. వాటిని అక్కడి నుంచి తొలగించలేదు. దీంతో స్థానికులు కూడా తమ ఇళ్లలోని వ్యర్థాలను అక్కడే పడేశారు. అన్ని వ్యర్థాలు గుట్టగా పేరుకుపోయి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విభాగం అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు.



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేదీప్యవిజయ్

## తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

**వెంగళరావునగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** వెంగళరావునగర్ డివిజన్‌లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ దేదీప్యవిజయ్ తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆమె గురువారం మధురానగర్ హెచ్-బ్లాక్‌లో జలమండలి మేనేజర్ రాజేందర్, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## ట్రాన్స్‌జెండర్‌కు రిమాండ్

**బోరబండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** తోటి ట్రాన్స్‌జెడర్లను వేధింపులకు గురిచేయడమే కాకుండా, పలువురి ఆత్మహత్యాయత్నానికి కారణమైన గ్రూపు నాయకురాలు మోనాలిసాను రిమాండ్ కు తరలించారు. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాన్స్‌జెండర్ల గ్రూపు నాయకురాలైన మోనాలిసా వివాహాది శుభకార్యాల్లో సంపాదించిన డబ్బును పంచకుండా వేధించడమే కాకుండా, వ్యభిచారం కోసం బలవంతంగా కొందరిని పంపించేది. దీంతో స్వప్న నేతృత్వంలో వారంతా వేరే గ్రూపుగా ఏర్పడ్డారు. దీంతో కక్ష పెంచుకున్న మోనాలిసా తన అనుచరుల ద్వారా వారిపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు పెట్టించింది. విసిగిపోయిన స్వప్న గ్రూప్ ట్రాన్స్‌జెండర్లు బోరబండ బస్టాపు వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఇందులో భాగంగా ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోవడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. స్వప్న ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు మోనాలిసాను బెల్లంపల్లిలో అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు రిమాండ్ విధించడంతో ఆమెను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

### కస్టడీ కోరనున్న పోలీసులు

చంచల్‌గూడ జైలులో ఉన్న మోనాలిసాను విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకునేందుకు బోరబండ పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## నగలు తీసుకొని డబ్బు ఇవ్వకుండా మోసం

**బంజారాహిల్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** నగలు తీసుకొని డబ్బు ఇవ్వకుండా మోసం చేసిన వారిపై కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లికి చెందిన మ్యాడం షణ్ముక్ కార్తీక్ నగల వ్యాపారి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్. 10కి చెందిన భాష్యకర జువెలరీస్ నిర్వాహకుడు ఉమామహేష్ కాసారం 2023లో సుమారు రూ.15 లక్షల విలువ చేసే నగలు తీసుకున్నాడు. ఇందుకోసం మూడు లక్షల రూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. రోజులు గడుస్తున్నా మిగతా డబ్బు తిరిగి ఇవ్వలేదు. చివరకు నిలదీయగా రూ.23 లక్షలకు చెక్కు ఇచ్చాడు. బ్యాంక్‌లో నగదు లేకపోవడంతో బౌన్స్ అయింది. మరోసారి రెండు చెక్కులు ఇచ్చాడు. అవి కూడా బౌన్స్ అయ్యాయి. మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. కోర్టు తీర్పు ప్రకారం బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థానికుల ఫిర్యాదు మేరకు వెంగళరావునగర్ డి-బ్లాక్‌లో వీధి శునకాన్ని పట్టుకున్న జీహెచ్‌ఎంసీ డాగ్ స్క్వాడ్ సిబ్బంది

- వెంగళరావునగర్, ఆంధ్రజ్యోతి





అంగన్‌వాడీ ప్రాజెక్ట్-2 కేంద్రం



యాదగిరినగర్ అంగన్‌వాడీ కేంద్రం

# అంగన్‌వాడీల్లో వసతులు కరువు

### రోజురోజుకూ తగ్గుతున్న చిన్నారులు

**యూసుఫ్‌గూడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్ ప్రాజెక్ట్ పరిధిలోని చాలాచోట్ల సొంత భవనాలు లేక ప్రభుత్వ పాఠశాలలు, సామాజిక భవనాలు, అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వీటిలోని కొన్ని కేంద్రాల్లో కనీస సదుపాయాలు లేవు. తాగునీరు, మరుగుదొడ్లు లేక పిల్లలు, టీచర్‌లు ఇబ్బంది పడుతున్నారు. దీనివల్ల అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారుల సంఖ్య రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది.

**టీచర్లు, ఆయాల కొరత**

ఖైరతాబాద్ ప్రాజెక్ట్-2 పరిధిలో 151 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాళ్లలో నిర్వహిస్తున్నవి-51, బస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఒక రూమ్ ఉచితంగా ఇచ్చినవి మూడు, ప్రభుత్వ పాఠశాల భవనాల్లో-10, అద్దె భవనాల్లో-77, సొంత భవనాల్లో-10 కేంద్రాలు ఉన్నాయి. వీటిలోని చాలా కేంద్రాల్లో కనీస వసతులు లేవు. 11 మంది టీచర్లు, 65 మంది ఆయాలు కూడ లేరు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని, ఖాళీగా ఉన్న ఆయాలు, టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.



యూనిసెస్ ప్రచురించిన 'చిల్డ్రన్స్ రైట్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా.చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్



పాల్గొన్న బాలలు

# పిల్లల బంగారు భవిష్యత్‌కు కృషి చేయాలి

**బేగంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు, గురువులు కృషి చేయాలని సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి సూచించారు. గురువారం మహాత్మా జ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా 'బాలల ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించారు. డా.చిన్నారెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలను వివిధ రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. పిల్లల మనోభావాలకు అనుగుణంగా పెద్దలు నడుచుకోవాలని సూచించారు. ప్రధానంగా బాలికల పట్ల గౌరవంగా ఉండాలని, బాల్య వివాహాలు చేయవద్దని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలపై యూనిసెస్ ప్రచురించిన 'చిల్డ్రన్స్ రైట్స్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్, యూనిసెస్ సౌత్ ఇండియా చీఫ్ జలేలం తఫెసి, చైల్డ్ రైట్స్ సంస్థ అధికారి రమేష్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్





ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను అభినందిస్తున్న మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, నాయకులు బాపయ్య చౌదరి, రజినీ, వెంకటేశ్వరరావు, హరిబాబు, లక్ష్మణ్‌రావు, తదితరులు

# ఖైరతాబాద్‌వాసులకు సహకారం : నవీన్ యాదవ్



నవీన్‌యాదవ్‌ను సత్కరిస్తున్న నందకిశోర్ యాదవ్, తదితరులు

**ఖైరతాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్‌వాసులకు ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయారెడ్డితోపాటు తన సహకారం తప్పక ఉంటుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్ యాదవ్‌ను ఖైరతాబాద్ భారీ గణపతి ప్రాంగణంలో స్థానిక నేత నందకిషోర్ యాదవ్, తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బాణాసంచా కాల్చి బ్యాండ్ మేళాలతో నవీన్‌ను ఆహ్వానించి గణపతి వద్ద పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపు కోసం కష్టపడిన వారికి ధన్యవాదాలు తెలిపారు. తాను ఖైరతాబాద్ గణపతిని మొక్కిన రెండు రోజులకే టికెట్ ఇస్తున్నట్లు ప్రకటన వచ్చిందని, ఎమ్మెల్యేగా తన తొలి సత్కారం భారీ గణపతి ప్రాంగణంలో జరగడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మారయ్య యాదవ్, ప్రదీప్ యాదవ్, మహేష్ యాదవ్, సునందన్ యాదవ్, వెంకటేష్, ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్, సభ్యురాలు వీణామాధురి, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

### స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే

**యూసుఫ్‌గూడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పురోగతి, సంక్షేమ పథకాలపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## ఇనుప చువ్వలు మాయం

**బంజారాహిల్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** నిర్మాణ భవనం వద్ద నుంచి 200 ఇనుప చువ్వల రింగులు మాయమయ్యాయి. మణికొండకు చెందిన సతీష్ ఇంజనీర్. నందగిరిహిల్స్‌లో ఓ భవన నిర్మాణ పనుల్లో పాలుపంచుకుంటున్నాడు. రెండు రోజుల క్రితం నిర్మాణం కోసం ఇనుప చువ్వలతో రింగులను సిద్ధం చేశారు. కాగా, ఈనెల 19న రింగుల్లో సుమారు 150 కిలోల 200 రింగులు మాయమయ్యాయి. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బాలుడికి శస్త్ర చికిత్స చేసిన వైద్యులు

## 'గాంధీ'లో ఏడేళ్ల బాలుడికి లాపరోస్కోపిక్ శస్త్ర చికిత్స

**అడ్డగుట్ట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** గాంధీ ఆస్పత్రిలో ఏడేళ్ల బాలుడికి మొదటి సారిగా లాపరోస్కోపిక్ శస్త్ర చికిత్స చేశారు. పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి నాగార్జున మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా, భీమిని మండలం, అక్కినపల్లి గ్రామానికి చెందిన అఖిల్ అనే ఏడేళ్ల బాలుడు ప్లీహం పెరగడం, తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నాడు. ప్రతీవారం రక్తమార్పిడి చేయాల్సి వచ్చేది. బాలుడిని కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించి లాపరోస్కోపిస్ శస్త్రచికిత్స చేశామని, ప్రస్తుతం బాలుడు కోలుకున్నాడని డాక్టర్ నాగార్జున తెలిపారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**మారేడుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ముఖ్యమంత్రి సహాయనిధిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో పలు డివిజన్లకు చెందిన 15 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 7.57 లక్షల రూపాయల విలువైన చెక్కులను బాధితులకు వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో తలసాని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, నాయకులు మల్లికార్జున్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, వెంకటేషన్ రాజు, నాగులు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

● కంటోన్మెంట్ ఐదో వార్డు సంజీవయ్య నగర్‌కు చెందిన ఎం. బిక్షపతి యాదవ్‌కు, అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన మాస్టర్ షేక్ సాహెరి రెహాన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఒకరికి రూ. 18 వేలు, మరొకరికి రూ. 60 వేలు మంజూరయ్యాయి. బాధితులకు చెక్కులను వాల్మీకి నగర్‌లో పెద్దల నరసింహ గురువారం అందజేశారు.

## ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్



మారేడుపల్లి మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ అస్మతుల్లా ఖాన్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలో సమస్యలపై చర్చించారు. పేదల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు పద్మారావుగౌడ్ సూచించారు.

- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో రోడ్డుపై మురుగు పరుగు

● దుర్వాసనతో ప్రజలు, వాహనదారుల ఇబ్బంది



పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్

**బోయినపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో ఓ దాబా నిర్వాకం వల్ల రోడ్డుపై మురుగునీరు పారుతుండడంతో దుర్వాసన వస్తోంది. కొద్ది రోజులుగా డ్రైనేజీ జామ్ కావడంతో మురుగునీరు రోడ్డుపై పారుతుండడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికివచ్చే ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఓయూలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

**ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఉస్మానియా విశ్వవిద్యాలయం హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ)ఆధ్వర్యంలో సాయి లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను గురువారం నిర్వహించారు. హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయా చరణ్, కో-ఆర్డినేటర్ సూర్యవల్లి మాట్లాడుతూ డొమైన్ నైపుణ్యాలతో పాటు ప్రజెంటేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ కమ్యూనికేషన్ మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. డ్రైవ్ ఆన్‌లైన్ మోడ్‌లో సాగింది. అసెస్‌మెంట్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన వారికి తదుపరి రౌండ్లు త్వరలో నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

### ఏర్పాటు చేశారు..

# మరమ్మతులు మరిచారు

● పద్మారావునగర్ పార్కులో పాడైపోయిన వ్యాయామ పరికరాలు
● ఉపయోగంలో లేని వైనం
● వాకర్స్ ఇబ్బంది

**పద్మారావునగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** పద్మారావునగర్‌లో జీహెచ్ఎంసీ పార్కులో సమస్యలతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసినా అవి పాడైపోయినా మరమ్మతులు మరిచారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వచ్చిన వారు వ్యాయామాలు చేయలేకపోతున్నారు. ఓపెన్ జిమ్ పరికరాలను ఏర్పాటు చేయడంలో చూపించిన శ్రద్ధ అవి పాడైపోతే పట్టించుకునే వారు కరువయ్యారని వాకర్స్ ఆరోపిస్తున్నారు.

### సమస్యలను పరిష్కరిస్తాం

పార్కును ఇటీవల జీహెచ్ఎంసీ నార్త్‌జోన్ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్ సిబ్బందితో సందర్శించి సమస్యలను పరిశీలించారు. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.



ఇంకుడు గుంతలో చెత్తాచెదారం



అధ్వానంగా ఉన్న టాయిలెట్

### అధ్వానంగా టాయిలెట్

పార్కుకు వచ్చే వారి కోసం కొన్నేళ్ల క్రితం టాయిలెట్ ఏర్పాటు చేశారు. నిర్వహణ కరువవడంతో అధ్వానంగా తయారైంది. దుర్వాసన వస్తుండడంతో సందర్శకులతోపాటు వాకర్లు ఇబ్బందులు పడుతున్నారు.

### ఇంకుడు గుంతలో చెత్తాచెదారం

పార్కులో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇంకుడు గుంతలోని చెత్తాచెదారాన్ని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాకర్స్ అంటున్నారు. పార్కులోని సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



పాడైన వ్యాయామ పరికరం

### వ్యాయామ పరికరాలకు మరమ్మతులు చేయాలి



పద్మారావునగర్ పార్కులో పాడైన వ్యాయామ పరికరాలకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలి. వాటిని బాగుచేయించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఎం.ఏ.రషీద్, వాకర్

### సమస్యలను పరిష్కరించాలి



పార్కులో సమస్యలు పరిష్కరించాలి. టాయిలెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. ఇంకుడుగుంతలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

- విశ్వనాథ్, బోయిగూడ నివాసి

## కంటోన్మెంట్‌ను అభివృద్ధి చేస్తున్నామనడం హాస్యాస్పదం



మీడియాతో మాట్లాడుతున్న వంశ తిలక్

**సికింద్రాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** నాలుగువేల కోట్ల రూపాయలతో కంటోన్మెంట్‌ను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు వంశ తిలక్ అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కంటోన్మెంట్ రహదారుల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతుంటే దానిని కంటోన్మెంట్ అభివృద్ధిగా చెప్పడం ఎమ్మెల్యేకే దక్కిందన్నారు. రూ. 4 వేల కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం అప్పగించిన కంటోన్మెంట్ స్థలాలకు పరిహారంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 303 కోట్లు చెల్లిస్తే.. దానిని ఆర్థిక సహాయంగా శ్రీగణేష్ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నిధులు కేంద్ర ప్రభుత్వ ఖజానాలో జమ కావాల్సి ఉండగా.. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ చొరవతో కంటోన్మెంట్ అభివృద్ధికి ఖర్చు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వంశ తిలక్ పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 50 కోట్లు తీసుకురావాలని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. కంటోన్మెంట్ బోర్డు ఖాతాలో జమ కావలసిన ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీస్ (టీపీటీ) చార్జీలు రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమ చేసుకుని, బోర్డుకు అడపాదడపా కొంత మొత్తం చెల్లిస్తోందని, టీపీటీ చార్జీలు నేరుగా కంటోన్మెంట్ బోర్డు ఖాతాలో జమయ్యేలా ఎమ్మెల్యే చూడాలని ఆయన డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలి పదవీ కాలం వచ్చే ఫిబ్రవరితో ముగియనుందని, దళితుడైన తనకు ఈసారి అవకాశం ఇవ్వాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కంటోన్మెంట్‌లో ఇప్పటి వరకూ దళితుడికి నామినేటెడ్ సభ్యుడిగా అవకాశం దక్కలేదన్నారు.

## సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్‌లో సంగీత నృత్య పోటీలు



అనురాధ కర్హాడేకు జ్ఞాపిక అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ పి. జ్యోతి



విద్యార్థినుల నాట్య ప్రదర్శన

**మారేడుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్లో మధుసూదన్‌రావు జ్ఞాపకార్థం రెండు రోజుల పాటు జరగనున్న మధు సంగీత నృత్య సమారోహ సంగీత నృత్య పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ గాయని అనురాధ కర్హాడే జ్యోతి ప్రజ్వలన చేసి నృత్య పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల్లో దాగి ఉన్న కళాతృష్ణను బయటకు తీసేందుకు సంగీత నృత్య పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. న్యాయ నిర్ణేతలుగా శాస్త్రీయ నృత్య కళాకారిణి శ్యామల శ్రీనివాస్, హిందుస్థానీ సంగీత దర్శకుడు ఎమ్మెస్ నవీన్ కుమార్, బోనాల కిరణ్మయి, తబల నిపుణుడు యశ్వంత్ పుండు, నృత్య కళాకారిణి సంచలన కృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి. జ్యోతి మధుసూదన్ రావు, డైరెక్టర్ స్వాతి పంపాల్కర్, అకాడమీ డైరెక్టర్ ఏంఏం అగస్టిన్, టీటీ అసోసియేషన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీకాంత్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గ్రేస్ ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే అధికారి ఇంట్లో చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

● లక్షరూపాయల విలువైన సొత్తు స్వాధీనం

**మల్కాజిగిరి, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి):** రైల్వే అధికారి ఇంట్లో చోరీ చేసిన వ్యక్తిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి లక్షరూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ప్రేంవిజయ్‌నగర్ కాలనీలో దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ పర్సనల్ అధికారిగా పనిచేస్తున్న మాలతి నివసిస్తోంది. ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి గుర్తుతెలియని ఆమె వ్యక్తి ఇంట్లో చోరీ చేశాడు. మాలతి 15వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మల్కాజిగిరిలో 50 సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. చోరీ చేసింది అదే కాలనీకి చెందిన పలాల్ నిఖిల్(21)గా గుర్తించారు. సాయినగర్‌లో అనుటెక్స్ వద్ద గురువారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి లక్ష రూపాయల విలువ చేసే ఫోన్లు, ఐప్యాడ్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.





పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న సొత్తు



పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న అడిషనల్ డీసీపీ నర్సయ్య

## పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

**బౌద్ధనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** పోలీసు అధికారులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య సూచించారు. చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బందికి పద్మారావునగర్ ఏస్వీకాలేజీలో బుధ, గురువారం 'ఒక గొప్ప మార్పుకు ఇదే శ్రీకారం' కాన్సెప్ట్‌తో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఎస్వీఐ చీఫ్ మేనేజర్ టి.టి.లిజేష్, న్యూలైఫ్ వెల్‌నెస్ ట్రైనర్ ఎన్.పురుషోత్తం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

## బిర్యానీలో కోడి ఈకలు

● 4 చిల్లీస్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ
● అపరిశుభ్రంగా వంటగది, ఫ్రిజ్‌లో కుళ్లిన చికెన్



బిర్యానీలో కోడి ఈకలు

**ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** బిర్యానీలో కోడి ఈకలు దర్శనమిచ్చాయి. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు బిర్యానీ తినేందుకు ఎన్‌సీసీ గేటు వద్ద ఉన్న 4 చిల్లీస్ రెస్టారెంట్‌కు గురువారం వెళ్లారు. బిర్యానీ తింటుండగా కోడి ఈకలు కనిపించాయి. రెస్టారెంట్ నిర్వాహకులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతోపాటు దురుసుగా ప్రవర్తించారు. దీంతో విద్యార్థులు జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి చేరుకుని బిర్యానీ శాంపిల్స్ సేకరించి ల్యాబ్ టెస్టులకు పంపించారు. అనంతరం రెస్టారెంట్‌లో తనిఖీ చేయగా వంటగది అపరిశుభ్రంగా ఉండటం, ఫ్రిజ్‌లో కుళ్లిన చికెన్, మయనైజ్ నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. ల్యాబ్ నుంచి రిపోర్టు వచ్చిన తర్వాత రెస్టారెంట్‌పై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## నేడు గంగపుత్రుల వల విసిరే పోటీలు

**ముషీరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ఈనెల 21వ తేదీ ఉదయం 10గంటలకు గంగపుత్రుల వల విసిరే పోటీలు నిర్వహిస్తున్నామని గంగపుత్ర మహాసభ అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. పోటీలను ముషీరాబాద్‌లోని వాలీబాల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామన్నారు. గంగపుత్రులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

**రాంనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** బాలల హక్కుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఎస్ఆర్‌డీ, ఆశ్రిత, ఎస్ఈఎస్ స్వచ్ఛంద సంస్థల సంయుక్తాధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ జోగుల నర్సయ్య పాల్గొని మాట్లాడారు. గొప్ప, పేద అని తేడా లేకుండా బాలలందరికీ సమాన హక్కులు ఉన్నాయన్నారు. పిల్లలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్మికశాఖ అధికారి నీలిమ, డాక్టర్ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సౌదీలో 18 మంది మృతి విచారకరం

● మాజీ మంత్రి మహమూద్ అలీ

**ముషీరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఒకే కుటుంబానికి చెందిన 18మంది సౌదీలో మృతిచెందడం బాధాకరమని మాజీ మంత్రి మహమూద్‌అలీ అన్నారు. బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో కలిసి విద్యానగర్‌లోని బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అలీమస్కతి, హర్షద్ అలీఖాన్, అక్లక్‌హుస్సేన్, జహీరుద్దీన్ సమర్, మున్వర్‌చాంద్, ముక్తార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

**బేగంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** భర్త, అత్తింటి వేధింపులు భరించలేక ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు చెందిన కవిత(38)తో ఫతేనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భట్టి రాఘవేంద్ర(39)కు 2023లో వివాహమైంది. నగదుతో పాటు బంగారు ఆభరణాలు వరుడికి కట్నంగా ఇచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన రాఘవేంద్ర తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. కవిత ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురమ్మని కవితను రాఘవేంద్ర వత్తిడి చేశాడు. ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు చెప్పగా రూ. 5 లక్షలు ఇచ్చారు. అయినప్పటికీ రాఘవేంద్ర నిత్యం మద్యం తాగొచ్చి వేధిస్తున్నాడు. అత్తింటి వారు కూడా వేధిస్తుండడంతో భరించలేని కవిత ఈనెల 15న ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన రాఘవేంద్ర బాలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ ఈనెల 20న మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో నిర్వహిస్తున్న రుద్రహోమం



బాపూజీనగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జంపన ప్రతాప్



రసూల్‌పురాలో అన్నదాన కార్యక్రమంలో సాద కేశవరెడ్డి

### కార్తీక మాసం చివరి రోజు..

## ఆలయాల్లో రుద్రాభిషేకాలు, హోమాలు

### అమావాస్య సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదానం

**సికింద్రాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** కార్తీక మాసం చివరి రోజును ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో రుద్రాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్‌లోని శివాలయాలతోపాటు ఇతర దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీపాలు వెలిగించారు. గురువారం అమావాస్య కావడంతో పలు దేవాలయాలు, కాలనీలు, బస్తీల్లో అన్నప్రసాదం పంపిణీ నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహాకాళి ఆలయ ప్రాంగణంలోని వీరభద్రస్వామి సహిత మహాకాళేశ్వర స్వామికి 108 లీటర్ల పాలు, పండ్లతో ప్రత్యేక అభిషేకం చేశారు. అమ్మవారి దేవస్థానంలో రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. బోయినపల్లి బాపూజీనగర్‌లోని శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయం, చిన్నతోకట్ట కట్టమైసమ్మ ఆలయాల వద్ద కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నప్రసాద పంపిణీని ప్రారంభించారు. రసూల్‌పురా పోలీస్ లైన్ ఉషాగిడ్డంగి వద్ద కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి అన్నప్రసాదం పంపిణీ చేశారు.



లాలాబజార్‌లో అన్నదాన కార్యక్రమంలో ప్యారసాని శ్యామ్‌కుమార్, భాగ్యశ్రీ తదితరులు

**తిరుమలగిరి:** అమావాస్యను పురస్కరించుకొని లాల్‌బజార్‌లోగల మహాకాళి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యురాలు భాగ్యశ్రీ ఆధ్వర్యంలో దాతల సహకారంలో అన్నదానం చేశారు. బొల్లారం సదర్ బజార్‌లో మహాకాళి దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు.

### న్యూఅశోక్‌నగర్‌లో కార్తీకమాస దీపోత్సవ పూజలు



పూజల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మి, మేకల కీర్తి తదితరులు

**బౌద్ధనగర్:** పార్శీగుట్ట న్యూఅశోక్‌నగర్ వీరాంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాస దీపోత్సవ పూజలను గురువారం నిర్వహించారు. బీజేపీ నాయకురాలు మేకల కీర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేసి దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, మహిళామోర్చా అధ్యక్షురాలు అనిత, నాయకురాళ్లు శోభారాణి, నాగరాణి, సరిత, భాగ్యమ్మ, లావణ్య, యాదమ్మ, ప్రమీల, జ్యోత్స్న, వాసవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



లాలాపేటలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బండ కార్తీకరెడ్డి

**తార్నాక:** అమావాస్యను పురస్కరించుకుని లాలాపేట్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం లాలాపేట్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో లాలాపేట్ ఆర్యవైశ్య సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు నేతి రాములు, అధ్యక్షుడు మడిపడగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పందిరి సాంబశివరావు, కోశాధికారి ఎనిశెట్టి భాస్కర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.